# విచిత్రత్రయం

ఊళ్ళో శబ్దాలన్నీ యింకిపోయి నిశ్శబ్దం వ్యాపించింది. కార్లూ, బస్సూ, రిక్షాల హడావుడీ, ఫ్యాక్టరీల కూతలు, మనుషుల అలికిడీ, వాళ్ళ పాటలూ, మాటలూ, ఏడుపులూ నెమ్మది నెమ్మదిగా దూరమైపోయాయి. అప్పటికి మాత్రం అవి నల్లటి ముసుగు దుప్పటిలో దాక్కున్నాయి. మళ్ళీ ఉదయం యథావిధిగా రణగొణ ధ్వనీ, చెవులు చిల్లులుపడే శబ్దాలూ చీకటి ముసుగును తొలగించి నిశ్శబ్దంలో సంచలనాన్ని సృష్టిస్తాయి.

సాయంకాలానికి ప్రకృతి అలసిపోతుంది. సూర్యుడు రొప్పుతూ రోజుతూ ఆ చివరినుండి యీ చివరవరకూ వచ్చి యిక నడవలేక నీళ్ళల్లో దాక్కుని చూస్తుంటాడు- సృష్టి ఏమయిందీ అని. జనత విశ్రాంతి తీసుకుంటుంది. జంతువులు, పక్షులు, చెట్లు- అన్నీ విశ్రాంతి తీసుకుంటాయి కొత్త వాతావరణంలా ప్రకృతి తారు పూసుకుని మూల కూర్చుని కునుకుతుంటుంది. నల్లటి ముసుగు దుప్పటికి సన్నని చిరుగులున్నాయి. అందులోనుండి, వెలుగు కిరణాలు రాలేక రాలేక అతి కష్టంమీద దూరివస్తున్నాయి. అయినా లోన అంతా చీకటేవుంది.

చైతన్యంలేని ప్రకృతి చచ్చిన జెర్రిగొడ్డులా పడుంది. అన్నింటితోపాటు ఊరూ నిద్రపోతోంది. వీధుల్లోనూ, యిళ్ళ బయటా మనుషుల అలికిడిలేదు. చలి గజగజ వణికిస్తోంది. జనం యిళ్ళల్లో తలుపులు బిడాయించుకొని నిద్ర పోతున్నారు. వీధిలో దీపాలు అంతంత దూరానికి ఒక్కొక్కటి చొప్పున ఒంటరిగా పహరా జవానుల్లా నిలుచున్నాయి.

ఒక వీధిలో దీపంకూడా వెలగలేక ఆరిపోయింది. రెండు కుక్కలు కసిగా పోట్లాడుకుని ఎదురెదురుగా నిలబడి చూసుకుంటున్నాయి. మళ్ళీ ఏ క్షణంలోనన్నా కలబడదామని. ఇద్దరు ముగ్గురు ఆ వీధిలోనుండి నడిచి

పోయారు. చీకట్లలో కరిగి ఒకరికి కనిపించకుండా మరొకరు నడుస్తూ, అందుకు సాధ్యమైనంత దూరంగా, జోళ్ళు శబ్దం చేయకుండా జాగ్రత్తగా అడుగులు తేల్చివేస్తూ వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన పావుగంట వరకు అత్తర్లూ, సెంట్లూ, పూలగుత్తుల పరిమళాలూ, పౌడర్లూ, స్నోల సువాసనలతో వీధంతా నిండిపోయింది.

ఊరంతా నిద్రపోతున్నా సినిమాహాలు దగ్గరా, స్టేషన్లోనూ జనంవున్నట్టే ఆవీధిలోనూ జనం తిరుగుతూవుంటారు. అందరికీ కావలసిన విశ్రాంతి కాదప్పుడు వాళ్ళుకోరేది. ఆనందం యొక్క చీకటి రూపాన్నీ, ముసుగు కప్పేసిన నికృష్టపు బతుకు అందాన్నీ అక్కడ కొనుక్కొందుకని జనం వస్తుంటారు. రాత్రిసమయంలోనే ఆవ్యాపారం సాగుతుంటుంది. బతుక్కి బంగారం పూసి అద్దాల బీరువాలోంచి చూపించి మనుషుల్ని మోసగించేందుకు రాత్రి తప్ప మరొకటి లేదు. ఉదయం చూస్తే అక్కడ ఏమీ వుండదు. ఎంతో బోసిగా, వాడిపోయిన తర్వాత రంగూ, వాసనాలేక ఒరిగిపోయి కళావిహీనమైపోయిన పువ్వులాగా ముడతలు పడిపోయినట్టు సౌందర్య రహితంగా వుంటుందక్కడ.

ఆవీధిలో అక్కడా అక్కడా అంతంతదూరంలో ఒక్కొక్కటిచొప్పున అయిదారిళ్ళు వున్నాయి. మిగతావన్నీ మామూలువే. అన్నీ అందంగా వెలిగిపోతున్నాయి. రేడియోల సంగీతం, గాలికి ఎగిరే కర్టెన్ల రెపరెపలు, పాటలు, నవ్వులు, మూలుగులు, ఆప్యాయంగా మెల్లగా రహస్యంగా వాగ్దానాలు అక్కడ మెలికలు తిరుగుతూ గాలిలో కరిగి పలచబడి క్రమక్రమంగా మాయమవుతున్నాయి. అన్ని యిళ్ళల్లోనూ గుమ్మాల దగ్గరా, స్తంభాలకు జారబడీ, ఇళ్ళకిటికీ కలుగుల్లోంచి కులుకుతూ, నవ్వుతూ, కళ్ళు తిప్పి అభినయిస్తూ అర్ధనగ్నంగా ఎదుటివాళ్ళను ఆకర్షిస్తూ అందాన్ని అమ్ముకొని వ్యభిచారం వ్యాపారంచేసి, కొనుక్కున్న వాళ్ళను అమాయకుల్నిచేసి, వాళ్ళను అవమానించి నవ్వించి పంపేస్తున్నారు. అదో సర్దా! ఏడిపించబడేవాడు ఏడవడు. అలా కావడం ఒక అదృష్టంగానూ, అది అందరికీ లభించనిదానిగానూ, వాళ్ళ నవ్వులూ, సరసాలూ తనలాంటి ఏ అదృష్టవంతుడికోతప్ప అందరికీ కాదను కొంటూ నవ్వేసి చక్కాపోతున్నారు.

అక్కడ విశేషంగా వ్యాప్తిలో వున్నది- ఒక కళ. అదే అభినయం! అది లేనినాడు వాళ్ళ బతుకు లేదు. సంతోషంలేక పోయినా నవ్వుతూ వాళ్ళను ఆకర్షించేట్టు మనసును నిర్దయగా అణగదొక్కి, శరీరంలో బలంలేకపోయినా, రోగంతో మూల్గుతూ మూల కూర్చున్నా కప్పిపుచ్చి, లేని ఉత్సాహంతో చలాకీగా ఒళ్ళనీ కళ్ళనీ కదిపి ఎదుటివారిని కుదిపివేయాలి. ముసలితనాన్నీ, ముడుతల శరీరాన్నీ, భయంకర రూపాన్నీ దాచి అది కనబడనీయకుండా నవ్విస్తూ, హావభావాల్ని చూపిస్తూ రోజూ రోతతో విసిగిపోయినా, యిష్టంలేక పోయినా ఆ పనికి పూనుకోవాలి. అందుకు కావలసినదంతా నటన! కృత్రిమం!! లేనిదాన్ని తెచ్చి చూపించి మోసగించడం!!! అందుకు ఎంత నేర్పు వుండాలి!

వాళ్ళకు అది చెయ్యగూడదనీ, అది వట్టి మోసమనీ, నికృష్టజీవితమనీ ముదనష్టపు బతుకనీ, ఆ బతుకులో తృప్తి లేదనీ తెలుసు దొంగకు దొంగతనం చెయ్యడం యిష్టం వుండొచ్చు. కాని అది మంచిపని అనలేడు. అది ఎలాటిదో అతనికి తెలుసు. వ్యక్తిత్వాన్నీ, గౌరవాన్నీవదులుకొని ప్రాణంతో చెలగాటం ఆడుతూ దయాదాక్షిణ్యాల్ని వదిలిపారేసి గుండెను రాయిచేసుకోవాలి. కడుపులో బిడ్డ బైటపడేవరకూ ప్రసవ వేదనపడే తల్లి తన జీవితాన్ని అసహ్యించుకుంటుంది. కాని అది ఆ క్షణం వరకే. ఆ తర్వాత జ్ఞాపకంవచ్చి "ఎంత వెర్రిగా ఆలోచించాను" అనుకుంటుంది! ఇదీ అంతే.

చెడ్డపని చేస్తున్నప్పుడు మనసులో ఒక మూల బాధా, ఆ చేస్తున్నపని నిజస్వరూపం, భవిష్యత్తులో దాని ఫలితాలూ కనిపిస్తాయి. అయినా అవి మనసును మార్చలేవు. చెడు, మంచికన్న అనేకరెట్లు బలంకలది. ఇలాంటి ఆలోచనలు అప్పుడప్పుడు ఏకాంతంగా కూర్చున్నప్పుడూ, గత జీవితాన్ని తలచుకొంటున్నప్పుడూ, శుద్ధ అమాయకుడినీ, మంచివాడినీ మోసగిస్తున్నప్పుడూ కలిగి కేవలం నీలితెరల మాదిరిగా, గాలిపొరల్లా, మబ్బుతునకల్లా ఎక్కడికో దూరానికి మళ్ళీ కళ్ళకు కనిపించనంత దూరానికి జారుకుపోతాయి.

అలాంటి జనంవున్న వీధుల్లోంచి వెళ్తున్నాడు వాసుదేవరావు. ఆ వూరికీ, ఆ వీధికీ అతను పూర్తిగా కొత్త. ఆ వూరికి పనిమీదవచ్చి, మిత్రుడి అడ్రసున్న కాగితం పట్టుకొని వెతుక్కొంటూ వెళ్తున్నాడు.

ఆట్టే విశాలమైన వీధి కూడా కాదు. చిన్న సందులా వుంది. అటూ యిటూ యిళ్ళు పొదుచుకొని నుంచున్నాయి. ఒక కుక్క అతన్ని చూసి మొరుగుతూ స్తంభానికి కట్టిన గొలుసు తెంపుకొనేందుకు ప్రయత్నిస్తోంది. ఆ వెంటనే రంగుల సీతాకోకచిలుకలు, వన్నెల విసనకర్రలు కలుగుల్లోంచి చిట్టెలుకలు తొంగిచూస్తున్నట్టు కిటికీల్లోంచీ, సగంతెరిచిన తలుపు సందుల్లోంచీ చూస్తున్నాయి. ఒకరు ఏదో అన్నారు అతన్నిచూసి. ఇద్దరు కిలకిలా నవ్వారు పక్షుల్లా.

ఒక యింటిముందు ఆగి యింటినంబరు కనిపిస్తోందేమోనని తలుపుకేసి చూశాడు. అతను ఆగడం చూసి ఇద్దరమ్మాయిలు వీధిలోకి పరుగెత్తుకొచ్చారు. తెల్లని మడతలుపోని చీర, అదేరంగు జాకెట్టు, మెళ్ళో మెరుస్తోన్న రాళ్ళ నెక్లెసు, చేతులకు బంగారంరంగు గాజులు, తలకు పాపిడిపిండె—నియాన్ లైటు వెలుతుర్లో జిగేల్‌మన్నాయి. ఒకామె సన్నగా, బక్కపలచగా, ఎర్రగా వుంది. పెదాలకు లిప్‌స్టిక్, ముఖానికి పౌడరూ రాసినట్టు తెలుస్తోంది. రెండో అమ్మాయి ఓ మాదిరిలావు. ఛామనఛాయ. పెదాలకూ, గోళ్ళకూ రంగు పులుముకొంది.

మొదటి అమ్మాయి ఏదో గొణిగింది. రెండో అమ్మాయి "రండీ" అంది.

అతను నవ్వుకొని వెళ్ళిపోయాడు. ఆ వీధితత్వం అతనికి అర్థమయ్యింది. అలాంటి వీధిలో తన మిత్రుడున్నందుకు ఆశ్చర్యపోయాడు. ఆలోచిస్తూ రెండడుగులు వేసేసరికి "బాబూ ఒక్క అగ్గిపుల్లవుంటే యిప్పిస్తారా, చుట్ట కాల్చుకోవాలి" అంటూ యాభైఏళ్ళు దాటిన సాధువు గెడ్డం దువ్వుకొంటూ వచ్చాడు. మనిషిని ఎగాదిగా చూసి "ఎక్కడికెళ్తున్నారు బాబూ?" అన్నాడు.

వాసుదేవరావుకు చెప్పాలనిపించలేదు. కాని, మిత్రుడు వుండే వీధి యిదేనా అన్న అనుమానం వచ్చింది. 'ఒకవేళ అడ్రసు పొరపాటున తప్పు యిచ్చాడేమో, ముందే తెలుసుకొంటే మంచిదిగా' అనుకున్నాడు. అరడజను పుల్లలు తీసిచ్చి "ఈ వీధిలో తాలూకా ఆఫీసు గుమాస్తా ఎవరన్నా వున్నారా?" అన్నాడు.

"అదే. ఇక్కడినుండి మూడోయిల్లే, ఎల్లండి" అని తనే అక్కడనుండి ముఖం ముడుచుకొని ముందే కదిలిపోయాడు.

వాసుదేవరావు ఆయింటి గుమ్మంవరకూవచ్చి మిత్రుడు నరసింహాన్ని కేకేసి తలుపుకొట్టాడు. 'ఎవరూ ?' అంటూ ఓ మగకంఠం లోపల్నుంచి విని పించింది. "నేనూ, వాసుదేవరావును" అన్నాడు తాపీగా, అది తన మిత్రుడి కంఠమే అని నిర్ధారణ చేసుకుని.

నరసింహం తలుపు తీసుకునివచ్చి "ఆరె నువ్వటోయ్! రా" అంటూ లోపలికి తీసుకుపోయాడు.

ఏమిటి యిలా అంటున్నాడనిపించింది వాసుదేవరావుకు.

తెచ్చుకున్న సంచి యింకా కింద పెట్టకుండానే "ఏమిటిది! ఇలాంటి వీధుల్లో వుంటున్నావేమిటోయ్ ? ఊళ్ళో యిళ్ళే దొరకలేదా ? ఇంటికి వచ్చే టప్పటికి చచ్చాననుకో" అన్నాడు. రావడంతోనే అదే అతను మొట్టమొదట అడిగిన ప్రశ్న.

"ఏం చెయ్యమంటావ్ ? రెండేళ్ళకిందట యీ వీధిలో అన్నీ సంసారుల కొంపలే—ఒకటీ అరా తప్పించి. ఈ మధ్య బొత్తిగా మరీ అధ్వాన్నంగా తయారయిందనుకో. సంవత్సరంలోనూ అయిదారిళ్ళు లేచాయి. ఇక్కడేకాదు, ఊళ్ళో అన్నిచోట్లా ఇలానే వున్నారు. ఊరు పెరిగేకొలదీ నాగరికత అభివృద్ధి అవుతూవుంటే యీ వ్యాపారంకూడా ప్రపోర్షనేట్‌గానే పెరుగుతోంది. పూర్తిగా సంసారుల కొంపలున్న వీధులు కావాలన్నా కనిపించవు" అన్నాడు నరసింహం.

ఆ తర్వాత అతనే చెప్పాడు—

"చస్తున్నాననుకో ఈ వీధిలో వుండలేక. రోజూ రాత్రిళ్ళు వెధవ అల్లరి. ఒక్కొక్కప్పుడు మాయింటి తలుపుల్నే బాదుతుంటారు తెలుసా—అన్నీ అలాటివే అనుకుని! ఉండలేకపోతున్నా. త్వరలో ఎక్కడికయినా మార్చెయ్యాలి."

ఇద్దరూ సావకాశంగా కూచున్నారు.

"అలా చిక్కిపోయావేం?" అన్నాడు వాసుదేవరావు—నీరసించిపోయిన వాడిలా ఎముకలు బైటపడి చొప్పదవడలు, లోపలకు పోయిన కళ్ళు, సన్నగా చేతులూ కాళ్ళూ, అర్చుకుపోయి ఎముకల్ని అంటిపెట్టుకున్న గుండెతో—మనిషి అదోలా జీవంలేనట్టుగా ఆయాసపడుతూ రొప్పుతూ రోజుతూన్న నరసింహాన్ని చూసి.

"ఏంలేదూ .... వెధవది నర్వస్ వీక్నెస్‌తో ఏణ్ణర్థంబట్టి బాధపడుతున్నాను. నరాలు లాక్కుపోతుంటాయి. నీరసం, ఆయాసం—ఇదీ. ఏపనీ చెయ్యలేను....అలసట. ఉత్సాహం వుండదు. రాత్రిళ్ళు ఎక్కువ సేపు మేల్కోలేను. దానికితోడు. నేనే కేంపు క్లర్కుని. అస్తమానం ఏ పల్లెటూరికో కేంపులు తగులుతూనే వుంటాయి... నిద్ర సరిగా వుండదు. మానుకుందామా అంటే మూడు రూపాయలు ఒకసారికి చేతిలో కొస్తుంటే ఎలా మానాలనిపిస్తుంది."

ఆ తర్వాత నరసింహం భార్యని పిలిచి వాసుదేవరావుకు పరిచయం చేశాడు. ఆమె కాస్సేపు నుంచొని వెళ్ళిపోయింది స్నానానికి నీళ్ళు తోడుదామని.

ముఖంలో ఉత్సాహంలేదు. అదోలా దిగులుగావుంది. అతను చెప్తున్న దానికి ఊకొట్టనైనా ఊకొట్టలేదు. భర్తతో మాట్లాడినంతసేపూ చాలా ముభావంగా చెయ్యమన్నవిచేసి అక్కర్లేదన్నవి వదలివేస్తోంది. అదోరకమైన నిర్లక్ష్యం. అతనంటే కోపం. వాటిని దాచుకోడానికి ముందు గుండె రాయిచేసుకున్నట్టు కనిపిస్తుంది. ఎప్పుడన్నా నవ్వినా లేనినవ్వు తెచ్చిపెట్టుకున్నట్టు పేలవంగా, బాధగా, మెల్లగా, భారంగా నవ్వుతుంది. ఆ నవ్వు ఎవరినీ సంతోషపెట్టలేదు. అది సహజమైనది కాదని, అంతా కృత్రిమం అని సులభంగానే తెలిసిపోతుంది.

అలా వుండక మరింకెలా వుంటుంది! అతనివల్ల ఆమె సుఖించిందేదీ? ఏడాదిన్నరగా యీ రోగం. ఇప్పటికే యీనెపుల్లమాదిరి తయారయ్యాడు. దానికితోడు రాత్రిళ్ళు ఊర్లో వుండడు. అలాంటి భర్తని కట్టుకున్నందుకు లోలోపల తిట్టుకుంటుందికూడా.

వాసుదేవరావు భోజనం చెయ్యలేదు. వస్తున్నప్పుడే టిఫీను, కాఫీ తీసుకుని వచ్చాడు యీ అర్థరాత్రి వాళ్ళను బాధపెట్టడం దేనికని. మంచినీళ్ళు తాగి నిద్రపోయాడు.

ఉదయంలేచి, త్వరగా తెమిలి ఏడింటికే పనిమీద వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం రెండింటికిగాని రాలేదు. ఇంటికి వెళ్ళేసరికి నరసింహం ఆఫీసుకి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నంవరకు ఎదురుచూసి.

నరసింహం భార్య వరలక్ష్మి "భోజనం వడ్డించాను రండి" అంది. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు యిచ్చింది.

వాసుదేవరావు భోజనం చేస్తుండగా "వచ్చినపని అయిపోయిందాండి" అంది.

"ఆ....అయిపోయినట్టే. మళ్ళీ ఒకసారి కలుసుకుంటేసరి. సాయంకాలం వూరెళ్ళిపోతూ అలా కలుసుకుందా మనుకుంటున్నాను." అన్నాడు.

"అదేమిటి! ఒక్కరోజన్నా సరిగ్గా వుండందే. మా ఆయనగారు మిమ్మల్ని నాలుగు రోజులు వుంచేద్దాం అన్నారు. మీకు వేరే పనేమీ లేదటగా, ఉండండి, రెండు రోజులు వుండి వెళ్ళుదురుగాని"

"ఖాళీయే అనుకోండి, కాని యిక్కడ మాత్రం చేసేదేముంది"

"చేసేది వుందని నేనూ అనడంలేదు. రేపు ఆదివారమేకదా. మీరిద్దరూ అలా వూరల్లా తిరిగిరావచ్చు. మీకుకూడా యీవూరు కొత్తటగా. కాస్సేపు సావకాశంగా మాట్లాడుకోడానికి, మంచిచెడ్డలు చెప్పుకోడానికి వీలుంటుంది."

"నిజమే ...కాని, ఏమిటో వెళ్ళాలనుకున్నాను. వెళ్ళకపోతే ఆదోలా వుంటుంది. మళ్ళీ వస్తాలెండి నెలరోజులు పోయాక. అప్పుడు వారం రోజుల పాటు వుండి మరీ వెళ్తాను."

వరలక్ష్మి మరేమీ మాట్లాడలేదు. గిర్రున వెనక్కితిరిగి లోపలికి వెళ్ళి పోయి మళ్ళీవచ్చి "సరే, రేపు పొద్దున్న మీవూరువస్తే మేమూ అలానే చేస్తాం. బంధుత్వం, స్నేహం వున్నచోట్ల యిలాటివి పనికిరావండీ" అంది.

ఆ మాటలో చిరుకోపం, 'ఇదీ' అని చెప్పుకోలేని బాధ యిమిడి వున్నాయి. ఆ కళ్ళు చెమ్మగిల్లడం, ఒక నిశ్వాసం భారంగా, దీర్ఘంగా ఆమె తీయడం అతను చూడలేదు.

భోజనం అయిపోయాక గదిలో కూర్చున్నాడు.

వరలక్ష్మి తమలపాకులు తెచ్చి యిచ్చింది. వాసుదేవరావు వేసుకుని నములుతూ పేపరుచూస్తూ కూర్చున్నాడు.

పావుగంటయ్యాక అతను పేపరు వత్తిగించిచూస్తే ఆ ఎదురుగా కాస్త దూరంలో ఆమె కూచుని యిటే చూస్తోంది. ఒక పక్కకు తలతిప్పి, మెల్లగా మూలిగి లేచి వెళ్ళిపోయింది. ఆమె కళ్ళల్లో దేన్నో వెతికి అలసిపోయిన అలసటనీ, వేదననీ అతను చూశాడు.

వాసుదేవరావు 'ఏమిటీ' అనుకున్నాడు.

అనేకమంది స్త్రీలతో అతనికి పరిచయంవుంది. వాళ్ళను పొగిడి, మాటలు చెప్పి లోబరచుకునే శక్తి వుంది. తెల్లటి గుండ్రని అందమైన ముఖం అతనిది. నల్లగా వెనక్కు తిరిగిన జుత్తు, ముఖంలో పెదాలమీద చిరునవ్వు, దానికింద రెండుగా చీలినట్టు సన్నని గాడి కలిగిన గెడ్డం అతని వయసుని మభ్యపెట్టి చూపిస్తుంటాయి. అయినా యిరవై ఎనిమిదేళ్ళు కూడా దాటినవాడు కాదు. అతనికి చాలామంది స్త్రీల తత్వం తెలుసు. ఒకొక్కరు ఒకొక్కరకంగా అతని ముందు అభినయిస్తుంటారు. వాటన్నిటికీ అతను అలవాటు పడ్డాడు. అదంతా కృత్రిమమని అతనికి తెలుసు. తనని మభ్యపెట్టడానికి చేస్తున్నదని అతను ఎరుగును. అదే వాస్తవం అయినప్పుడు మాత్రం విచిత్రంగా అతని ఆలోచనలు గడ్డకట్టుకుపోతాయి. అదీ కొద్దిసేపే. ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించుకున్నప్పుడు జవాబు రాకపోతే 'తీసిపారేయ్' అన్నట్టు ఆ విషయం పక్కకు తోసేస్తుంటాడు.

వరలక్ష్మి గురించి వాసుదేవరావు ఏమీ అనుకోలేకపోయాడు. సంసారంలోని విషయాలు, ఏమిటిలే— అనుకుని, అలా వెళ్ళొస్తానని బయల్దేరాడు.

సాయంకాలం వరకు ఎక్కడెక్కడో తిరిగి యింటికి చేరుకున్నాడు యిక వెళ్ళిపోదామని నిర్ణయించుకుని.

కాని లాభం లేకపోయింది.

నరసింహం వీధిలోనే కూర్చుని వాసుదేవరావు రావడంతోటే "అదేమి టోయ్! అప్పుడే వెళ్ళిపోతానంటున్నావట. లాభంలేదు. నాలుగు రోజులైనా వుండాలి. అధమం ఇవాళా, రేపైనా వుండక తప్పదు. సోమవారం ఉదయం వెళ్దువుగానిలే అన్నాడు.

వాసుదేవరావు "అబ్బే, రేపొక్కరోజు...." అంటూ ఏదో గొణిగాడు.

''చూద్దాంలే'' అన్నాడు నరసింహం.

ఆరాత్రి పదకొండింటికి హెడ్‌క్లర్క్ రెండో కూతురి పెళ్ళి అనీ, తను వచ్చేటప్పటికి పన్నెండవుతుందని చెప్పి, వాసుదేవరావుకు నిన్నటిలాగే నడవాలో పక్కవేయమని చెప్పి వెళ్ళిపోయాడు నరసింహం.

వాసుదేవరావు భోజనం చేసి పక్కమీదకు చేరుకున్నాడు. అంత వేగంగా నిద్రపోవటం అలవాటులేదు. మాట్లాడుకుంటూ కూచుందామంటే నరసింహం పనుందని వెళ్ళిపోయాడు. ఒక్కడూ యింట్లో దేనికని బయటికి వెళ్ళివద్దామన్నా బయట చలి కొరుక్కుతింటోంది. కూడా ఉలెన్ స్వెటర్ పట్టుకురావడం మర్చిపోయాడు. విధిలేక గదిలోనే నాలుగు గోడలమధ్యా కిటికీలు బిగించి, పేరుకు లోపలి తలుపులు కొద్దిగా తీసి సిగరెట్టుమీద సిగరెట్టు ఊదుతూ కూర్చున్నాడు.

వరలక్ష్మి వంటింట్లో పని పూర్తిచేసుకొచ్చి కాస్సేపు అతనితో ఏదో అప్రస్తుతంగా మాట్లాడుతూ కూర్చుంది.

అక్కడ కూర్చున్నంతసేపూ ఆమె చేష్టలు చిలిపిగా, అసహ్యంగా, భరిచడం కష్టంగా అనిపించాయి.

అతను చలించలేదు కాని చూసి వూరుకున్నాడు.

ఆమె నవ్వేది.

కొంటెగా చూసేది.

'అబ్బా' 'పోండి' అనేది.

కొద్దిగా కోపం, నవ్వు, సిగ్గు, సన్నిహితత్వం........ఇంకా ఆ మాటల్లో మృదుత్వం, ప్రేమ, రహస్యంగా ఏదో చెప్తున్న భావం స్ఫురించేవి.

ఆ కొద్దిపాటి సన్నిహితత్వంలోనూ మోటుగా, గట్టిగా వేళాకోళం' సన్నగా తెలతెల్లగా నవ్వులు, మెల్లగా మృదువుగా హృదయాన్ని గిలిగింతలు పెట్టే మాటలు. ఆవలిస్తూ బద్ధకంగా లేచి కూర్చొని ఒళ్ళు విరుచుకొని అతని ముందు పాములా మెలికలు తిప్పి చూపిస్తున్న శరీరం—వాసుదేవరావుకు రోత, అసహ్యం, కోపం పుట్టించాయి.

మరొకరే గనుక అలా చేస్తూవుంటే ఆనందంగా తనకు తనే కావాలని వెళ్ళి ఆమె కోర్కెల్ని తీర్చేవాడు. గత అనుభవాన్నంతా ఆమె ముందు పోసి, తృప్తిగా సంతోషంగా ఆ కళ్ళను నవ్వించి వచ్చేవాడు

కాని ఆమె—అతడిని నమ్మి నిశ్చింతగా తన పని చూసుకునేందుకు వెళ్ళిన మిత్రుడి భార్య !

ఆమె దాహంతో ఎదురు చూస్తున్నమాట నిజం. కాని ఆమె దాహం తీర్చేపాటి వాడు కాడు తను.

దాహంతో గొంతు ఎండిపోయేవాడికి కొద్దిగా నీళ్ళతడి తగిలితేనే ప్రాణం లేచివచ్చినట్టు వుంటుంది. అవి ఎలాంటివో, ఎవరిస్తున్నారోనన్న ఆలోచన వుండదు. కేవలం దప్పిక తీర్చుకోవడమే వాళ్ళ ఉద్దేశం.

వాసుదేవరావు పెద్దగా ఎఫెక్ట్ కాలేకపోయాడు. స్త్రీ అందం, వాళ్ళ చూపులు, నవ్వులు, మాటలు, చేతలకు లొంగిపోవడానికి అతడికవేమీ కొత్త కావు. లోగడ అనేకమంది స్త్రీలతో అనుభవంవుంది. అయితే యిప్పటికీ అతను వాటిని కావాలని కోరుకుంటాడు. అందుకు కారణం అతను వాళ్ళ ప్రలోభాలకు, మోసానికి, కృత్రిమానికి లొంగిపోయికాదు. అదొరకమైన ఆనందం. దర్జాగా, సగర్వంగా చెప్పుకొనే విషయం !

వాసుదేవరావు మూడు సిగరెట్లు వరుసగా కాల్చి బద్ధకంగా ఆవలించాడు—ఇక నిద్రపోదామని.

వరలక్ష్మి గట్టిగా నిట్టూర్చి లేచి వెళ్ళిపోయింది.

వాసుదేవరావు వెళ్ళిపోతున్న ఆవిడను చూసి, ముసుగుని మీదకు లాక్కున్నాడు — ఆపాదమస్తకం వెచ్చగా వుండేలా. ఆ తర్వాత ఆమె అవతలి గదిలో విసురుగా మంచం వేసుకోవడం, దుప్పటి దులపడం, నిద్ర పోతున్నప్పుడు గాజులు శబ్దం చేయడం, మంచం కిర్రుమనడం అన్నీ విని పించి క్రమంగా నిద్రమత్తులోకి వెళ్ళిపోయాయి.

మధ్యలో తెలివి వచ్చింది.

మంచినీళ్ళు తాగుదామని ఆ చీకట్లో నిద్రమత్తుతో వెతుకుతూంటే చెయ్యి తగిలి టేబిలుమీది గ్లాసు కిందపడి శబ్దం అయ్యింది.

వరలక్ష్మి తలుపు తీసుకుని కళ్ళు నులుపుకొంటూ వచ్చి "మంచినీళ్ళ వెతుకుతున్నారా, అవిగో టేబిలుమీద పెట్టాను" అంటూ తనే మంచినీళ్ళ వంపి యిచ్చింది.

లైటు వేసి కుర్చీలో కూర్చుంటూ "ఏమండీ, నిద్ర పట్టలేదా ?" అంది.

"పట్టింది" అన్నాడు ముభావంగా.

ఆమె అక్కడనుండి కదులుతుందేమోనని చాలాసేపు ఎదురుచూశాడు.

ఆమె అక్కడనుండి లేవలేదు.

వాసుదేవరావుకు విసుగుపుట్టింది.

ఆమెమీద అసహ్యం కలిగింది.

అక్కడ తను వుండడం భావ్యం కాదనుకున్నాడు. దండెంమీది చొక్కా తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

ఎక్కడకు వెళ్ళాలో ఆలోచించుకోకుండానే నడుస్తున్నాడు.

బయట చలి ఎముకల్నీ, పాదాల్నీ, మొత్తం శరీరాన్నీ కొరికేస్తోంది. అసలే తొడుక్కున్నవి సన్నని గ్లాస్కో బట్టలేమో గజగజ వణికిపోతున్నాడు.

సిగరెట్టు కాలుద్దామని జేబు తడుముకుంటే సిగరెట్లు దొరికాయిగాని అగ్గి పెట్టె కనిపించలేదు. ఇంట్లో ఎక్కడో వదిలేసి వుంటాడు. ఎవరైనా ఎదురైన వాళ్ళను అడుగుదామన్నా ఒకరికొకరు కనిపించకుండా వుండాలని దొంగ చాటుగా మూలల్నుంచి తువ్వాల్ని ముసుగులుగా ముఖాన ఆనవాలు దొరక్కుండా

కప్పేసుకుని, ఎవరన్నా పలకరిస్తున్నా వినిపించుకోకుండా వెళ్తున్నారు. వాళ్ళను ఆపి అడిగినా, నిజంగా వాళ్ళదగ్గిర వున్నా, లేదని తప్పించుకు పోతారు!

ఆ వీధిలో ఒక చిన్న గుడివుంది. అది ఏ దేవుడి గుడో అతను పగలు పరిశీలించి చూడలేదుగాని ఎవరో ఒక దేవుడు అక్కడ కాపరం వుంటున్నాడని అతనికి తెలుసు. దేవుడు సర్వాంతర్యామి అనడానికిదో నిదర్శనం! అక్కడా యిక్కడా అనిలేదు, ఎక్కడబడితే అక్కడే వుంటాడు ప్రహ్లాదుడు చెప్పినట్టు. ఎక్కడయినా ఒకే రకం ఆనందం. ఆనాడు శ్రీనాథుడు వెండి శివలింగాన్ని మెళ్ళో వేసుకున్న ఆడమెను చూసి "జంగంస్త్రీ వక్షాల మధ్య లోయలో చల్లని నీడలో హాయిగా నిద్రపోతున్నావయ్యా శివయ్యా" అని అన్నాడంటే కేవలం దేవుడు అంత సుఖంగా నిద్రపోతున్నాడన్న ఈర్ష్యవల్లా, కోపంవల్లానూ. అతనికి మాత్రం తెలీదూ, దేవుడు అక్కడేమిటి ఎక్కడయినా వుంటాడని. ఏదో అప్పటికి అలా అన్నాడు అతనిమీద అసూయకొద్దీ.

వాసుదేవరావు ఆ గుడిదగ్గరకు చేరుకున్నాడు.

నిన్నటి సాధువు ఆ గుడి అరుగుమీద ఒక మూల దొంగచాటుగా కూర్చొని గంజాయిపట్టు పట్టిస్తున్నాడు. గట్టిగా దమ్ములాగి వదిలిపెడుతున్నాడు గొట్టంలోని గంజాయి వెలిగి ఆరిపోయి, రెండు నిమిషాల తర్వాత దమ్ము పీల్చడంతోనే మళ్ళీ రాజుకుంటోంది. అది వెలిగినప్పుడల్లా ఎర్రగా కందిపోయిన మొఖంలో యింకా ఎర్రగా వెలుతురు పడుతూ, అది పీల్చడానికి అతను పడుతున్న శ్రమంతా తెలుపుతోంది. ఒకొక్కసారి అయిదు నిమిషాల వరకు దగ్గిదగ్గి నీరసంగా మూలిగి, ఇంకో అయిదు నిమిషాలు గొట్టాన్ని ప్రక్కన పెట్టి, మళ్ళీ యధావిధిగా చేస్తున్నాడు. మధ్యమధ్య రెండేసి నిమిషాలకు ఒకసారి రామనామాన్ని గట్టిగా, స్వచ్ఛంగా జపిస్తున్నాడు.

"ఎవరు బాబూ" అన్నాడు సాధువు వెనక్కు తిరిగి వాసుదేవరావును చూసి.

తర్వాత అతనే కూర్చున్న చోటినుండి లేచివచ్చి పరిశీలనగా వాసుదేవరావు ముఖంలోకి చూసి "మీరా! రండి కూర్చోండి" అన్నాడు తను పడుకునే తాటాకుచాప దులిపి.

"ఏదీ కాస్త సిగరెట్టు వెలిగించుకోనీ, చలేస్తోంది" అంటూ చాపమీద చతికిలపడ్డాడు

చాలా వికృతంగా, విచిత్రంగా, గట్టిగా నవ్వాడు సాధువు.

అసలు అతని నవ్వే అంతేమో!

ఆ శబ్దానికి ఎదురుగా ఒక కలుగులోంచి రెండు చిలుకలు కిచకిచ లాడాయి.

వాసుదేవరావు ఆశ్చర్యంగా చూశాడు అతనివైపు.

"అదేవిటండీ, పాతికేళ్ళన్నా లేవు .... ముసలాళ్ళలా చలంటారేవిటీ" అన్నాడు నవ్వాపుకొని.

మళ్ళీ ఎదుటి కన్నంలో చిలుకలు కిచకిచమన్నాయి. రెండు కాదు మూడు! కొత్తగా వచ్చిన చిలక కలుగుదాటి బయటికే వచ్చి నుంచుంది, ఎగాదిగా వాసుదేవరావును చూస్తూ.

"ఏమిటి బాబూ చూస్తున్నావు?" అన్నాడు తాత.

"అబ్బే ఏంలేదు, ఎవరా అని"

"ఎవరేవిటి....రంభండి! తప్పపుట్టి యీ యింట్లో పుట్టిందిగాని లేకపోతే ఏ చక్రవర్తి కూతురో కాదుటండీ" తాత గెడ్డాన్నీ మీసాన్నీ కదిపి మెల్లగా నవ్వాడు.

వాసుదేవరావుకు అర్థమయ్యింది.

"ఎంతేమిటి?" అన్నాడు కొంటెగా.

"ఏముంది రెండు హస్తాలే. మీకు కావలిస్తే చెప్పండి ఒక హస్తానికే మాట్లాడి పెడతా"

వాసుదేవరావు మాట్లాడలేదు. మౌనంగా ఆలోచిస్తున్నాడు.

తాత మళ్ళీ అందుకున్నాడు. "రామరామ. నేను అబద్ధం ఆడతానను కొన్నారా, నిజం! ఆ రాముడి సాక్షిగా చెప్తున్నా. ఊరిలో యిలాంటి పిల్ల లేదనుకోండి. మేళం ఎవరు కడతారయ్యా అంటే ముందు అదిగో ఆ రాజ్యం పేరు చెప్పి ఆ తర్వాతే మిగతావాళ్ళని చెప్తారు. చూడండి నుంచొందిగా

ఖలేపిల్ల లెండి! అయితే పాదుషా, లేకపోతే ఫకీర్! పడితే ఆ పిల్లనే పట్టాలి. లేదూ యింక భోగందాని పేరు ఎత్తకండి మీ జన్మలో. గువ్వలాంటి పిల్ల బాబూ. ఇంకా చూస్తారేం"

తాత, ఓ మారుమూల పడేసిన గంజాయి గొట్టంతీసి మళ్ళీ ఒక్క దమ్ము లాగాడు గట్టిగా.

వాసుదేవరావు జేబులో చెయ్యి పెట్టాడు. అయిదు రూపాయల నోటు బయటి కొచ్చింది.

"సరే కానియ్" అన్నాడు, సిగరెట్టును ఆఖరిసారి గట్టిగాపీల్చి పారేస్తూ.

"మరి....మరి" నసిగాడు సాధువు.

"ఏం?"

"గంజాయి కొనుక్కుంటాను. ఒక్క అర్ధరూపాయివుంటే యిప్పిస్తారేమోనని."

"అర్ధరూపాయిలేదు, పావలాయే వుంది. ఇంద" వాసుదేవరావు పావలా తాత చేతిలో పెట్టాడు.

"ఉండండి, ఇప్పుడే వస్తా" అంటూ ఎదుటింటిలోకి వెళ్ళాడు సాధువు. అయిదు నిమిషాల్లో మళ్ళీ వెనక్కు తిరిగివచ్చి "వెళ్ళండి అదే యిల్లు. అన్నట్టు ఒక చుట్టపీకవుంటే యిప్పిద్దురూ పొద్దుటికి మళ్ళీ ఏంలేదు.

"లేవు తాతా... సిగరెట్లే కాలుస్తాను"

"పోనీ ఏదో ఒకటి. ఇలా పారెయ్యండి"

వాసుదేవరావు సిగరెట్టుని సాధువు దగ్గరికి విసిరి హుషారుగా గబగబా ఎదుటి మెట్లెక్కాడు.

వీధిలో నుంచున్న అమ్మాయి "రాండి" అంది. ఒయ్యారంగా ఊగుతూ వచ్చి భుజం పట్టుకుని లోపలకు తీసుకెళ్ళింది. ఖాళీగావున్న పెద్ద హాల్లోకి.

ఇద్దరు పిల్లలు అదే వయసువాళ్ళు సోఫాల్లో కూర్చుని డిటెక్టివ్ నవలలు చదువుతున్నారు.

ఒక ముసలావిడవచ్చి "చూసుకోబాబూ" అంది.

"రాజ్యం అట ఎవరూ ?" అన్నాడు ముగ్గుర్నీ చూసి.

"నేనే, రాండీ" అంది యిందాక వీధిలో నుంచున్న అమ్మాయి మెడ చుట్టూ ఒయ్యరంగా చేతులు చుట్టి.

హాలుకి కుడివైపు ఓ గదివుంది అట్టే చిన్నదీ కాదు, మరీ పెద్దదీ కాదు. లోన ఒక పందిరి మంచం గదిలో సగంవరకూ ఆవరించివుంది. మంచం మీద తెల్లని పరుపు, దుప్పటి, మీద కొన్ని మల్లెపూలు, గదిలో అగరువత్తులు — సగంకాలి పొగ మెలికలు మెలికలుగా గదినిండా మబ్బు తెరల్లా దట్టంగా సువాసనలు, నీలంరంగు బెడ్‌రూం లైటు, చిన్న దేవుడి ఫోటో, రెండు రోజుల కిందట వేలాడవేసిన మల్లెపూదండ, గాలికి ఎగిరే నీలితెరలు అన్నీ అందానికి అమర్చినవేగాని ఒకదానివల్లా ఉపయోగం వున్నట్టులేదు.

వాసుదేవరావు సెకండ్‌షో సినిమా విడిచిపెట్టే వేళకు యింటికి వెళ్ళిపోయాడు.

"సినిమా ఎలావుందీ ?" అన్నాడు నరసింహం.

"మీ మిత్రుడు సినిమాకు వెళ్ళా"డని అతనికి వరలక్ష్మి చెప్పింది.

వాసుదేవరావు "బాగానేవుంది" అన్నాడు జవాబుగా.

ఆ రాత్రికి నరసింహం పక్కనే వేరే మంచంమీద పడుకున్నాడు. వరలక్ష్మి లోన మరో గదిలో నిద్రపోయింది.

ఉదయం "ఇక తప్పదోయ్ ! నేను వెళ్ళిపోవాలి యీ బండికే" అంటూ పట్టుపట్టాడు వాసుదేవరావు.

నరసింహం ఆఖరుకు ఆరోజు సాయంకాలం వరకన్నా ఉండమన్నాడు గాని వుండలేదు. ఏదో వంకపెట్టి ప్రయాణం స్థిరపరచుకున్నాడు.

స్నానం పానం పూర్తవగానే వెళ్ళొస్తానని వరలక్ష్మితో చెప్పి బయలు దేరాడు. నరసింహం కూడా మిత్రుడివెంట బయలుదేరాడు బండెక్కించి వద్దామని.

అప్పటికి నెమ్మది నెమ్మదిగా వెలుగు కిరణాలు ముసుగు దుప్పటిలోకి, చీకటి కోణాల్లోకి, కలుగుల్లోకి వ్యాపించాయి. ఆగిపోయిన యంత్రం మీట నొక్కితే తిరిగినట్టుగా ప్రకృతి మళ్ళీ బద్ధకాన్ని దులుపుకొని ఆవలించి లేచి

పరుగులెత్తాలని బయలుదేరింది. జనం ఊరి వీధుల్లో అన్ని వైపులకు, మూల ల్లోకి నీళ్ళు జారినట్టు జారుతున్నారు. మళ్ళీ ఫ్యాక్టరీలు, కార్లు, బళ్ళు, జనం యధావిధిగా సంచలనాన్ని లేపి గోల చేస్తున్నాయి. అప్పుడే లేచినవాళ్ళు అప్పటికే కాలం అయిదుబారల దూరం పరుగెత్తే సరికి అదరా బాదరాగా ఊడిపోతున్న పంచెకట్లని వెనక్కి దోపుకుంటూ బొజ్జల్ని ఊపుకుంటూ పరుగెడుతున్నట్టు కదుల్తున్నారు. కాఫీ హోటళ్ళు, బజారు ప్రాంతాలు జనంతో నిండిపోతున్నాయి. రాత్రంతా హాయిగా నిద్రపోయిన మీదట ప్రకృతి ముఖం కొంచెం కళకళలాడుతోంది.

సాధువు కాషాయ బట్టలు తొడిగి, వీబూధి ఒళ్ళంతటికీ పులుముకుని రామనామాన్నీ, భక్తి కీర్తనల్నీ, నీతి ప్రబోధాల్నీ శ్రావ్యంగా భక్తితో తన్మ యత్వం పొందినవాడిలా పాడుతూ, పాడుతున్నప్పుడు సగం కళ్ళుమూసి, దానం చేసిన వాళ్ళను దేవుడు దయదలచి ప్రసన్నమయినట్టు చిరునవ్వు నవ్వి దీవిస్తూ ఊరిలోకి బయలుదేరాడు.

వరలక్ష్మి పవిత్రవతిలా పతివ్రత మాదిరి చీకటితోనే స్నానంచేసి, పూజచేసిన పువ్వుల్నీ అక్షతల్నీ తలసిగలో దోపి, ముఖంలో గుండ్రంగా కుంకుమబొట్టు తీర్చిదిద్ది, మిత్రుడ్ని దిగబెట్టడానికి బయలుదేరిన భర్తకు కండువా గొడుగు యిచ్చి, "వెళ్ళిరండి" అన్నట్టు చిన్న నవ్వు నవ్వింది ఆప్యాయంగా ప్రేమగా కొంచెం సిగ్గుగా భర్త ముఖంలోకి చూస్తూ.

వాడిపోయిన పూవును అందరూ అది సరికొత్తదనీ, అప్పుడే మొగ్గవిడిచిన దనీ తెలిపేందుకై అత్తర్లు సెంట్లు రాసి అలంకరించి కృత్రిమంగా అందాన్ని సృష్టించి, దాన్ని నలుగురూ నమ్మేందుకని, అందాన్ని అందరికీ కనిపించేలా చేసి వ్యాపారాన్ని లాభసాటి చేసుకోవాలని ఊళ్ళోకి బయలుదేరింది రాజ్యం.

వాళ్ళను చూస్తూ బండెక్కాడు వాసుదేవరావు.

వాళ్ళ ముగ్గుర్నీ దాటుకుంటూ ఆ వీధి మధ్యలోంచి పోయి మలుపులోకి మళ్ళింది బండి.

(1959)

*